కోల్‌కతా వంటి ఘటనలు జరగకుండా చూడాలి



ఘటనలు జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కన్నా కోల్‌కతా వంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. ఎంతో మంది ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వైద్యులకు మరింత రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వైద్యులకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజానీకం పరిస్థితి ఏమిటి.? వైద్యులు, వైద్య సిబ్బంది రక్షణ కోసం చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలి.

– డాక్టర్ చల్లా హరికుమార్, చిన్న పిల్లల వైద్యనిపుణుడు



డ్రెస్సింగ్ రూమ్స్ ఏర్పాటు చేయాలి



రోగుల ఆరోగ్యం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న వైద్యసిబ్బందికి అవసరమైన సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉంది. కోల్‌కతా ఘటన దృష్టిలో ఉంచుకొని వైద్యులు, వైద్య సిబ్బంది భద్రతపై చర్యలు తీసుకోవాలి. వైద్య సిబ్బందికి వెంటనే పటిష్టమైన రక్షణ కల్పించాలి. అలాగే స్టాఫ్‌నర్సులు, మహిళా సిబ్బందికి అవసరమైన డ్రెస్సింగ్ రూమ్‌లను ఏర్పాటు చేయాలి. టాయిలెట్లు అందుబాటులో ఉండేలా చూడాలి.

– బత్తుల సుప్రియ, స్టాఫ్‌నర్స్

నేటి తరానికి ఆదర్శం.. టంగుటూరి

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లాది విష్ణు



ప్రకాశం పంతులు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మల్లాది విష్ణు, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్వాతంత్య్ర సమర యోధుడు, ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జీవితం నేటి తరానికి ఆదర్శమని వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శుక్రవారం ఆయన మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి తుమ్మలపల్లి కళాక్షేత్రం సమీపంలోని టంగుటూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మల్లాది విష్ణు మాట్లాడుతూ మహాత్మాగాంధీ స్ఫూర్తితో దేశ స్వాతంత్య్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నాయకులు ప్రకాశం పంతులని గుర్తు చేశారు. దేశం కోసం న్యాయవాది వృత్తిని వీడి తన ఆస్తిని స్వాతంత్య్రం కోసం త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా పోరాడుతూ తెల్లదొరల తుపాకి గుండ్లకు ఎదురొడ్డి నిలిచి తన గుండెను చూపిన ధీశాలి ప్రకాశం పంతులని పేర్కొన్నారు. ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా చేసిన స్వల్ప కాలంలోనే కృష్ణా డెల్టా ఆయకట్టును స్థిరీకరించే రీతిలో నేటి ప్రకాశం బ్యారేజి నిర్మాణానికి బీజం వేసిన రైతు శ్రేయోభిలాషి అని కొనియాడారు. ఆయన ప్రారంభించిన స్వరాజ్య పత్రిక స్వాతంత్య్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఆంధ్ర ప్రజల అకుంఠిత ధైర్య సాహసాలకు, అసమాన త్యాగనిరతికి టంగుటూరి ప్రతీకగా నిలిచారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ శర్వాణి మూర్తి, పలువురు నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

చిత్తరంజన్ గ్రంథాలయంలో టంగుటూరి జయంతి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో శుక్రవారం ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్ టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టంగుటూరి జీవిత విశేషాలను కొనియాడారు. మద్రాసులో జరిగిన సైమన్ కమిషన్ వ్యతిరేక పోరాటంలో ధైర్యంగా బ్రిటిష్ సైనికుల తుపాకి ఎదురుగా నిలిచి ఆంధ్రకేసరిగా పేరు పొందారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

ఏకేటీపీ స్కూల్‌లో...

ఏకేటీపీ మున్సిపల్ హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు పింగళి రాయల్ టంగుటూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రాయప్రోలు వాసు, నాగార్జున, ఆచారి, తెన్నేటి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది, విద్యార్థులు టంగుటూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల చరిత్ర శాఖ విభాగాధిపతి డాక్టర్ ప్రకాశం, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, ప్రభుత్వ పాలన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పద్మనాభం, అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ జాన్ సుకుమార్, అధ్యాపకులు డాక్టర్ కొల్లేటి రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఘనంగా జరిగింది. సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(అడ్మిన్) కేఎస్ బ్రహ్మానందరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డిప్యూటీ సీపీఎం(ఎ) జయశంకర్, ఈడీ బ్రహ్మానందరెడ్డిలు మాట్లాడుతూ ప్రకాశం పంతులు సేవలను కొనియాడారు. ఈడీ(ఆపరేషన్స్) చంద్రశేఖర్, ఈడీ(ఇంజినీరింగ్) జీవీ రవివర్మ, ఎఫ్ఏ, సీఏఓ సుధాకర్, డిప్యూటీ సీపీఎం(హెచ్ఆర్‌డీ, వెల్ఫేర్) డి.సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

తెలుగు వారి గుండె చప్పుడు టంగుటూరి



దేశ భక్తి గీతాలను ఆలపిస్తున్న గాయకులు

విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాహితీ సమితి, కేవీ బ్రహ్మానందరావు సేవా సంస్థ ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకాశం పంతులు 152వ జయంతి సందర్భంగా గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదిక మీద శుక్రవారం ఆయన జయంతి వేడుకలు, దేశ భక్తి, లలిత గీతాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చిట్టిబాబు మాట్లాడుతూ ప్రకాశం పంతులు ఆంధ్రప్రదేశ్ తొలి ముఖ్యమంత్రిగా పనిచేశారన్నారు. టంగుటూరి తెలుగు వారి గుండె చప్పుడు అని అభివర్ణించారు. సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు మాట్లాడుతూ నేటి యువత ఆయన త్యాగ గుణం అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు శింగంశెట్టి చంద్రశేఖర్, గోళ్ల నారాయణరావు, చెట్టపల్లి మారుతీ ప్రసన్న పాల్గొన్నారు. గాయకులు దేవీడ్‌రాజు, అయ్యప్పన్, రజని, షబానా, ప్రిన్స్, నాగమణి తదితరులు దేశ భక్తి గీతాలను ఆలపించారు. నిర్వాహకులు టంగుటూరి చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు.



టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్



ఏకేటీపీ స్కూల్‌లో టంగుటూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పాఠశాల పూర్వ విద్యార్థులు



ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాలలో...,



టంగుటూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రహ్మానందరెడ్డి

క్లుప్తంగా

ఆక్రమణల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

మధురానగర్(విజయవాడ సెంట్రల్): ఎట్టకేలకు నగర పాలకసంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించారు. అయోధ్యనగర్ అన్న క్యాంటీన్ సమీపంలో ఆక్రమణలను శుక్రవారం తొలగించారు. అన్న క్యాంటీన్ సమీపంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగేలా ఆక్రమణలు జరుగుతున్నాయి. ఈ విషయాలను వివరిస్తూ సాక్షి ఇరిగేషన్ స్థలాల్లో యథేచ్ఛగా ఆక్రమణలు శీర్షికన కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ అరుణ తన సిబ్బందితో కలిసి నూతనంగా వెలిసిన ఆక్రమణల తొలగింపు చర్యలు చేపట్టారు. ఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో శుక్రవారం కాకినాడకు చెందిన శ్రీజ్యోతి నృత్య కళానికేతన్‌కు చెందిన పలువురు కళాకారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. నృత్య కళానికేతన్‌కు చెందిన చిన్నారులు కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్యాన్ని ప్రదర్శించారు. పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో లయబద్ధంగా నృత్య ప్రదర్శన ఇచ్చిన చిన్నారులను భక్తులు అభినందించారు. అనంతరం శిష్యబృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు

రోడ్డును సరిచేయండి సారూ..



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల కురిసిన వర్షాలకు దేవీనగర్ రైల్వేట్రాక్ సమీపంలో గుంతలు పడ్డాయి. ఈ గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. గుంతల్లో తరచూ వాహనచోదకులు పడి గాయాలబారిన పడుతున్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లినవారు ఏ విధంగా తిరిగి వస్తారో తెలియడం లేదని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

యువతి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): యువతి అదృశ్యమైన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. పోలీసుల కథనం మేరకు.. ఒంగోలుకు చెందిన యువతి అక్కడే ఓ యువకుడిని ప్రేమించింది. విషయం తల్లిదండ్రులకు తెలిసి పది రోజుల క్రితం ఆమెను విజయవాడ భవానీపురంలో ఉంటున్న మేనబావ రామ్‌చరణ్ తేజ ఇంటి వద్ద వదిలివెళ్లారు. గురువారం ఉదయం అతను పని మీద బయటకు వెళ్లాడు. కొద్ది సేపటి తర్వాత యువతి కనిపించడం లేదని రామ్‌చరణ్ కుటుంబ సభ్యులు ఫోన్ చేసి తెలిపారు. వెంటనే ఇంటికి వచ్చిన అతను సీసీ కెమెరాలు పరిశీలించాడు. ఇద్దరు యువకులు కారులో రాగా.. యువతి ఆ కారులో వెళ్లినట్లు గుర్తించాడు. దీంతో అతను పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి




మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతి ఒక్కరూ కనీసం రెండు మొక్కలు నాటి సంరక్షించాలని ఉద్యానవన శాఖ సిబ్బంది సూచించారు. స్థానిక 30వ డివిజన్ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి రోడ్డు (గద్దె వెంకట్రామయ్యనగర్ మెయిన్ రోడ్డు)లో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మొక్కలు నాటాల్సిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం జీవీఆర్‌నగర్ నుంచి 120 మొక్కలను నాటి ట్రీ గార్డులు ఏర్పాటు చేశారు. మొక్కల సంరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు



మధురానగర్(విజయవాడ సెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో శ్రావణ మాస శుక్రవారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు జరిగాయి. పీఠం వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీ చక్రార్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అ లాగే రామకృష్ణాపురం వేంకటేశ్వరస్వామివారి ఆ లయంలో అమ్మవారిని కరెన్సీ, నాణేలతో అలంకారం చేశారు. ఆలయ అర్చకులు అమ్మవారికి కలువ పూలతో అర్చనలు నిర్వహించారు.

బుడమేరులో డ్రోన్‌తో ఎంఎల్ ఆయిల్ స్ప్రే



బుడమేరులో డ్రోన్‌తో ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరులో దోమల నివారణ చర్యలు కొనసాగుతున్నాయి. దావు బుచ్చయ్యకాలనీ, గద్దె వెంకట్రామయ్యనగర్, విజయదుర్గానగర్, దేవీనగర్ తదితర ప్రాంతాల్లో శుక్రవారం నగరపాలకసంస్థ మలేరియా విభాగం సిబ్బంది డ్రోన్‌లతో బుడమేరులో ఎంఎల్ ఆయిల్ స్ప్రే చేశారు. ఈ సందర్భంగా బయాలజిస్టు సూర్యనాయక్ దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. చెత్తాచెదారం బుడమేరు, కాలువల్లో వేయరాదని సూచించారు. కాలువల్లో చెత్త వేయడం వల్ల నీటి ప్రవాహం నిలిచిపోయి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు డ్రై-డేగా పాటించి ఇంట్లోని నీటి నిల్వలను మార్చుకోవాలని సూచించారు. దోమల నివారణకు ప్రజలు తమ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నగరపాలకసంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫ్రైడే.. డ్రైడే

నగరంలో అవగాహన కార్యక్రమాలు



ఫ్రైడే డ్రైడే సందర్భంగా నగరవాసులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వీఎంసీ సిబ్బంది

పటమట(విజయవాడతూర్పు): దోమల నివారణ పై వీఎంసీ అధికారులు నగరవాసులకు అవగాహన కల్పించారు. ఫ్రైడే-డ్రైడే సందర్భంగా శుక్రవారం నగరంలోని పలు ప్రాంతాల్లో ర్యాలీలు, మైక్ ఎనౌన్స్‌మెంట్‌లు చేశారు. ప్రజారోగ్య విభాగం శానిటరీ సెక్రటరీలు 64 డివిజన్లలో వర్షం నీటి నిల్వలు పెరుగుతుండటంతో దోమల లార్వాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దోమలపై నిర్లక్ష్యంగా ఉండొద్దని, వాటితో మలేరియా, చికెన్ గున్యా, డెంగీ జ్వరాల బారిన పడకుండా ఉండటానికి వీఎంసీ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం ఫ్రైడే- డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తోందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా హెల్త్ సెక్రటరీలు ప్రతి ఇంటికీ వెళ్లి నిల్వ నీటితో ఎదురయ్యే ప్రమాదాలను వివరించారు. నెహ్రూనగర్, కొత్తపేట, వించిపేట తదితర ప్రాంతాల్లో కొబ్బరి బొండాలు, రుబ్బురోలు, కూలర్లు, పూల కుండీలు, తొట్టెలులాంటివి ప్రతి శుక్రవారం శుభ్రపరచుకోవాలన్నారు. అలా చేస్తే దోమలు లార్వా పెట్టే అవకాశం ఉండదని, దీంతో ఆరోగ్యంగా ఉండవచ్చని స్థానికులకు వీఎంసీ అధికారులు అవగాహన కల్పించారు. వీటితోపాటు డివిజన్లో యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని కల్వర్టుల్లో, వీధుల్లో ఫాగింగ్ చేయడం, మేజర్ అవుట్‌ఫాల్ డ్రైన్‌లలో డ్రోన్ ద్వారా ఎంఎల్ ఆయిల్స్ స్ప్రే చేశారు.

ఆన్‌లైన్‌లో పార్ట్‌టైమ్ జాబ్ పేరుతో టోకరా

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆన్‌లైన్‌లో పార్ట్‌టైమ్ జాబ్ అని.. మేము పంపే వాటికి 5 స్టార్ రేటింగ్ ఇస్తే చాలంటూ నమ్మించి ఓ వ్యక్తి నుంచి ఏకంగా రూ. 1.32 లక్షలు కాజేసిన వైనం తాజాగా వెలుగులోకి వచ్చింది. అజిత్‌సింగ్‌నగర్ పోలీసుల కథనం మేరకు.. అయోధ్యనగర్ నవభారత్ అపార్ట్‌మెంట్స్‌లో ఉంటున్న ఎం.సాయిరెడ్డి(36) అనే వ్యక్తికి ఈ ఏడాది జూన్ 6వ తేదీన తన వాట్సప్ నెంబర్‌కు పార్ట్‌టైమ్ జాబ్ అంటూ 7250571209 అనే నెంబర్ నుంచి మెసేజ్ వచ్చింది. దీనిని చూసిన అతను సదరు వ్యక్తులను సంప్రదించగా మాది ఆన్‌లైన్ ట్రేడింగ్ అని మేము పెట్టిన లింక్‌లను ఓపెన్ చేసి వాటికి ఫైవ్‌స్టార్ రేటింగ్ ఇస్తే చాలని, ఒక్కో రేటింగ్‌కు రూ. 50 చొప్పున డబ్బులు ఇస్తామని తెలిపారు. వారి మాటలు నమ్మిన అతను వారు పంపిన టాస్క్‌ను పూర్తిచేసి రూ. 1000 ఇవ్వగా తిరిగి అతనికి రూ. 1,300 చెల్లించారు. అలానే మరికొన్ని చేయాలని.. మీరు డబ్బులు పంపితే మీకు తిరిగి టాస్క్‌లు, డబ్బులు పంపుతామని చెప్పడంతో ఆయన రూ. 17,000 ఒకసారి, రూ. 60,000 ఒకసారి ఇలా మొత్తంగా రూ.1,32,000 గూగుల్ పే ద్వారా ఆ నెంబర్‌కు పంపారు. అయితే వారు తిరిగి డబ్బులు పంపకుండా కాలయాపన చేశారు. ఆ ఫోను నెంబర్ పనిచేయకపోవడంతో తాను మోసపోయానని గ్రహించాడు. సాయిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీ అభయ విఘ్నేశ్వరునికి ప్రత్యేక పూజలు



భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సంకట హర చతుర్థి సందర్భంగా శుక్రవారం స్థానిక సత్యనారాయణపురంలోని శ్రీ అభయ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బొగ్గవరపు బాల కోటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి నెలా సంకట హర చతుర్థి రోజు ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం అందజేయడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా ప్రతి బుధవారం సాయంత్రం స్వామివారికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు వంద కిలోల ప్రసాదం పంచుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి రఘు, సభ్యుడు మూర్తి, భక్తులు పాల్గొన్నారు.

బదిలీల్లో ఉద్యోగుల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలి



సంయుక్త రవాణా కమిషనర్ ఎస్.శివరామప్రసాద్‌కు వినతి పత్రం ఇస్తున్న రాజుబాబు, నాగమురళి

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలపై ఉన్న నిషేధాన్ని సవరించిన నేపథ్యంలో ఉద్యోగుల అభ్యర్థనను ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసుకోవాలని రవాణా శాఖ ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు, కార్యదర్శి కె.వి.వి.నాగమురళి కోరారు. ఈ మేరకు సంయుక్త రవాణా కమిషనర్ ఎస్.శివరామప్రసాద్‌కు శుక్రవారం వారు వినతిపత్రాన్ని అందజేశారు. అనారోగ్య సమస్యలతో ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు బాధపడుతున్నారని, ఆస్పత్రిల్లో చికిత్స పొందడానికి వీలుగా అనువైన ప్రాంతంలో బదిలీకి అవకాశం కల్పించాలని, ఏడాది లోపు ఉద్యోగ విరమణ చేసే వారికి బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల్లోని కార్యవర్గ సభ్యులకు బదిలీల మినహాయింపు ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు.

లలితా సహస్ర నామం సర్వశ్రేయోదాయకం



లక్ష కుంకుమార్చనలో భక్తులు

విజయవాడ కల్చరల్: శ్రీ లలితా సహస్రనామం సర్వశ్రేయోదాయకమని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణ మూర్తి అన్నారు. బ్రాహ్మణసేవా సంఘం, దాతల సహకారంతో సత్యనారాయణపురంలోని పాదుకా క్షేత్రంలో శుక్రవారం ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సామూహిక లలితా సహస్ర నామ పారాయణం, లలితా దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలరామకృష్ణ మూర్తి మాట్లాడుతూ లలితా సర్వదేవాలకు పూజనీయమైనదని తెలిపారు. 119 మంది మహిళలు లలితా సహస్ర నామ పారాయణం, లక్ష కుంకుమార్చనలో పాల్గొన్నారు. వేదపండితులు మురళీశ్రీనివాస్, బ్రాహ్మణ సేవ సంఘం కార్యదర్శి తణుకు రామకృష్ణ, ఉపాధ్యక్షుడు యద్దనపూడి శ్రీరామచంద్ర మూర్తి, క్రియాశీలక సభ్యులు కొప్పరపు మారుతీ ప్రసాద్, రామ సుబ్రహ్మణ్య, కమలా ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు న్యాయవాదుల నిరసన

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజాస్వామ్య హక్కులను హరించే నూతన క్రిమినల్ చట్టాల అమలును వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాదులు విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో శనివారం నిరసన చేపట్టనున్నారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, కాంగ్రెస్ లీగల్ సెల్, ఏపీసీఎల్ఏ, సీఎల్‌సీ, ఐఏపీఎల్, సెంటర్ ఫర్ సోషల్ జస్టిస్‌ల ఆధ్వర్యంలో తలపెట్టిన ఈ ధర్నాలో న్యాయవాదులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయా సంఘాల ప్రతినిధులు కోరారు.

నేడు వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్థానిక 29వ డివిజన్ కోలా సన్యాసిరావు రోడ్డు కొబ్బరితోట సెంటర్‌లో శనివారం శ్రీ గొలగమూడి వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం స్వామివారికి పూజలు, ఆరాధన జరుగుతుందన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. భక్తులు వెంకయ్యస్వామి ఆరాధన మహోత్సవాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా వారు కోరారు.

రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం అధ్యక్షకార్యదర్శుల ఎన్నికపై హర్షం

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర న్యాయమూర్తుల సంఘం అధ్యక్షుడిగా గొర్లె చక్రపాణి, కార్యదర్శిగా నంబళ్ల రమేష్‌నాయుడు ఎన్నిక కావడంపై బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కొత్త చంద్రమౌళి, అరిగల శివరామప్రసాద్(రాజా) హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 14వ తేదీన విజయవాడలోని ల్యాండ్ అక్విజేషన్ కోర్టులో జరిగిన ఎన్నికల్లో వీరి ప్యానల్ విజయం సాధించినట్లు తెలిపారు. అధ్యక్షులుగా ఎన్నికైన గొర్లె చక్రపాణి గుంటూరు ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తిగా, కార్యదర్శిగా ఎన్నికైన నంబళ్ల రమేష్ నాయుడు కాకినాడ మూడో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్నారని వివరించారు. వారిద్దరూ ఆంధ్ర యూనివర్సిటీ పూర్వ విద్యార్థులని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఎమ్మార్పీఎస్ నేత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్ల పాటు సుదీర్ఘంగా చేసిన పోరాట ఫలితంగానే సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపిందని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. సింగ్‌నగర్ లెనిన్‌సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మను ఆ సమితి నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడం సంతోషకరమన్నారు. అనంతరం అక్కడి నుంచి లూనాసెంటర్ వరకూ డప్పులు వాయిస్తూ వెళ్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఆరేళ్ల సతీష్‌మాదిగ, లింగాల కలమ్ కిరణ్ మాదిగ, దేవమణి మాదిగ, ఇందిర మాదిగ తదితరులు పాల్గొన్నారు.

యాంటీ నార్కోటిక్‌పై అవగాహన

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో యాంటీ నార్కోటిక్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈస్ట్ జోన్ డీసీపీ గౌతమీ షాలీ ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ ఎం. సత్యనారాయణ స్టేషన్ పరిధిలోని దుర్గా కళా మందిర్ రోడ్, పాత ప్రభుత్వాసుపత్రి రోడ్, గ్లోబల్ హాస్పిటల్ రోడ్ ప్రాంతాల్లో పలువురిని తనిఖీ చేశారు. బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వాడకం వల్ల జరిగే ప్రమాదాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళా ఎస్సై నారాయణమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవ ర్యాలీ

పాయకాపురం(విజయవాడరూరల్): జాతీయ అంతరిక్ష పరిశోధన దినోత్సవాన్ని పురస్కరించుకొని పుచ్చ లపల్లి సుందరయ్య మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి, హైస్కూల్ హెచ్ఎం డాక్టర్ మైనం హుస్సేన్ మాట్లాడుతూ చంద్రయాన్-3 లాంటి ప్రయోగాలు విజయవంతం కావడం దేశప్రజలు గర్వించదగిన విషయమన్నారు. అనంతరం విద్యార్థులు ఇస్రో సాధించిన విజయాలను ఉపయోగించి పోస్టర్స్ తయారు చేసి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.